అక్షర దర్బార్
వెల ₹5
www.aksharadarbar.com
voice of the people
మంగళవారం 24, డిసెంబర్ 2024 | సంపుటి :02 | సంచిక :272 | పేజీలు :05

పకడ్బందీగా సీఎం కప్..

- 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్రస్థాయి పోటీలు
- అధికారులతో హన్మకొండ కలెక్టర్ ప్రావీణ్య సమీక్ష సమావేశం

02

రౌడీ షీటర్లపై కఠినంగా వ్యవహరించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ తనిఖీ

02

అది నోరేనా?

మరిన్ని కథనాలు రేపటి సంచికలో

ఫోన్ కాల్‌లో ఓ మహిళ తో బూతు పురాణం

- ప్రముఖ చిట్‌ఫండ్ సంస్థ యాజమాని బరితెగింపు
- పత్రికలో రాయలేని విధంగా తిట్ల దండకం
- తన సంస్థలో పనిచేస్తున్న కొందరిపైనా ఇదే తీరు
- 'అక్షరదర్బార్' చేతికి ఆడియో టేపు
- ఇప్పటికే సార్‌పై కేసులూ.. అరెస్టు
- ప్రముఖ వ్యక్తి వెనుక చీకటి బాగోతం
- పూర్తి వివరాలు రేపటి కథనంలో..

02

ఆయన నగరంలోని ఓ ప్రముఖ చిట్‌ఫండ్ సంస్థ యాజమాని. ఖాతాదారులకు డబ్బులు ఎగ్గొట్టడం, చిట్టీ గడువు ముగిసి నెలలు, ఏళ్లు గడుస్తున్నా డబ్బు ఇవ్వకుండా తమ సంస్థ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం పరిపాటే. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతర్ చేయడం ఆయనకు కొత్తేం కాదు. ప్రజలు తన వద్ద దాచుకున్న సొమ్మంతా రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలకి తరలించి 'కనక' వర్షం కురిపిస్తారు. ఇదేంటని ప్రశ్నించే ఖాతాదారులకు గడువు మేరకు డబ్బులు ఇవ్వకుండా ఏదో ఫ్లాట్, జాగ అంటగట్టి చేతులు దులుపుకుంటారు. వీటిలో ఇద్దరు.. ముగ్గురి పేరున రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లు కూడా ఉన్నాయన్న ఆరోపణలు లేకపోలేదు. ఈక్రమంలో కేసులపాలవడమేగాక అరెస్టై జైలు జీవితం కూడా గడిపారు. గతంలో సంస్థలో మాజీ ఉద్యోగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడటం, సార్ వేధింపుల వల్లే తనువు చాలించాడని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆయనలో ఎలాంటి మార్పురాలేదు. తాజాగా ఫోన్‌లో ఓ మహిళ తో సంభాషించిన విధానం, వంకర మాటలు అతగాడి వికృత వైఖరికి అద్దం పడుతున్నాయి. దేవత పేరుతో చిట్ ఫండ్ సంస్థను స్థాపించిన ఈ ప్రబుద్ధుడి పేరులోనూ ఓ పుణ్యక్షేత్రం ఉంది.. అయితే నేమి ఇవన్నీ పక్కన పెట్టి... కనీసం మహిళ అని కూడా చూడకుండా బూతులకు దిగడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శంగా నిలుస్తోంది. . 'అక్షరదర్బార్' చేతికి ఆడియో చేరగా పత్రికలో రాయలేని భాషను చిట్‌ఫండ్ సంస్థ యాజమాని అందులో ప్రయోగించడం గమనార్హం. అంతేకాదు తన సంస్థలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగుల పైనా తూటాల్లా పేలుతున్న ఆయన తిట్ల దండకం చిట్స్ ఇండస్ట్రీలో చర్చనీయమైంది. సాధారణ ఉద్యోగి స్థాయి నుంచి ఇవాళ రాష్ట్రంలోనే ప్రముఖ చిట్ ఫండ్ అధినేతగా ఎదిగిన ఆ ప్రముఖ వ్యక్తి వెనుక చీకటి బాగోతం, ఆడియో కాల్‌కు సంబంధించిన పూర్తి వివరాలు రేపటి కథనంలో.. - అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

అంబేద్కర్‌ను అవమానిస్తే ఊరుకోం..

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో హన్మకొండలో నిరసన
- కేంద్ర ప్రభుత్వంపై ఎమ్మెల్యేల ఆగ్రహం

04

చిక్కడపల్లి ఠాణాకు పుష్ప

- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై పోలీసుల విచారణ
- మూడున్నర గంటల పాటు అల్లు అర్జున్ స్టేట్‌మెంట్ రికార్డ్
- అవసరమైతే మరోసారి నోటీసులు.. విచారణ

02

ఒకే పత్రిక ... సుదీర్ఘ ప్రయాణం..

- ఆంధ్రప్రభలో ముప్పై ఏడేళ్ల పాత్రికేయ ప్రస్థానం
- అలుపెరుగని జర్నలిస్ట్
- అవిశ్రాంత కలం యోధుడు.. మెండు రవీందర్

05

మంగళవారం
24.12.2024
www.aksharadarbar.com
అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

అది నోరేనా ?

- ఫోన్ కాల్‌లో ఓ మహిళతో బూతు పురాణం
- ప్రముఖ చిట్‌ఫండ్ సంస్థ యాజమాని బరితెగింపు
- పత్రికలో రాయలేని విధంగా తిట్ల దండకం
- తన సంస్థలో పనిచేస్తున్న కొందరిపైనా ఇదే తీరు
- 'అక్షరదర్బార్' చేతికి ఆడియో టేపు
- ఇప్పటికే సార్‌పై కేసులూ.. అరెస్టు
- ప్రముఖ వ్యక్తి వెనుక చీకటి బాగోతం
- పూర్తి వివరాలు రేపటి కథనంలో..

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: ఆయన నగరంలోని ఓ ప్రముఖ చిట్‌ఫండ్ సంస్థ యాజమాని. ఖాతాదారులకు డబ్బులు ఎగ్గొట్టడం, చిట్టీ గడువు ముగిసి నెలలు, ఏళ్లు గడుస్తున్నా డబ్బు ఇవ్వకుండా తమ సంస్థ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం పరిపాటే. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతర్ చేయడం ఆయనకు కొత్తేం కాదు. ప్రజలు తన వద్ద దాచుకున్న సొమ్మంతా రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలకి తరలించి 'కనక' వర్షం కురిపిస్తారు. ఇదేంటని ప్రశ్నించే ఖాతాదారులకు గడువు మేరకు డబ్బులు ఇవ్వకుండా ఏదో ఫ్లాట్, జాగ అంటగట్టి చేతులు దులుపుకుంటారు. వీటిలో ఇద్దరు.. ముగ్గురి పేరున రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లు కూడా ఉన్నాయన్న ఆరోపణలు లేకపోలేదు. ఈక్రమంలో కేసులపాలవడమేగాక అరెస్టై జైలు జీవితం కూడా గడిపారు. గతంలో సంస్థలో మాజీ ఉద్యోగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడటం, సార్ వేధింపుల వల్లే తనువు చాలించాడని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆయనలో ఎలాంటి మార్పు రాలేదు. తాజాగా ఫోన్‌లో ఓ మహిళతో సంభాషించిన విధానం, వంకర మాటలు అతగాడి వికృత వైఖరికి అద్దం పడుతున్నాయి. దేవత పేరుతో చిట్ ఫండ్ సంస్థను స్థాపించిన ఈ ప్రబుద్ధుడి పేరులోనూ ఓ పుణ్యక్షేత్రం ఉంది.. అయితేనేమి ఇవన్నీ పక్కన పెట్టి... కనీసం మహిళ అని కూడా చూడకుండా బూతులకు దిగడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శంగా నిలుస్తోంది. . 'అక్షరదర్బార్' చేతికి ఆడియో చేరగా పత్రికలో రాయలేని భాషను చిట్‌ఫండ్ సంస్థ యాజమాని అందులో ప్రయోగించడం గమనార్హం. అంతేకాదు తన సంస్థలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులపైనా తూటాల్లా పేలుతున్న ఆయన తిట్ల దండకం చిట్స్ ఇండస్ట్రీలో చర్చనీయమైంది. సాధారణ ఉద్యోగి స్థాయి నుంచి ఇవాళ రాష్ట్రంలోనే ప్రముఖ చిట్ ఫండ్ అధినేతగా ఎదిగిన ఆ ప్రముఖ వ్యక్తి వెనుక చీకటి బాగోతం, ఆడియో కాల్‌కు సంబంధించిన పూర్తి వివరాలు రేపటి కథనంలో..

కిషన్ రెడ్డిని కలిసిని బీజేపీ నాయకులు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన కమలనాథులు

అక్షరదర్బార్, రేగొండ: భారతీయ జనతా పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశిధర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి మంగళవారం హైదరాబాద్ లో తమ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పార్టీ కార్యక్రమాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి బీజేపీ పటిష్టతకు పలు సూచనలు చేసిన చేశారు.

పకడ్బందీగా సీఎం కప్..

- 27 నుండి జనవరి 2 వరకు రాష్ట్రస్థాయి పోటీలు
- అధికారులతో హన్మకొండ కలెక్టర్ ప్రావీణ్య సమీక్ష

అక్షరదర్బార్, హనుమకొండ : ముఖ్యమంత్రి ఛాంపియన్షిప్ ట్రోఫీ (సీఎం కప్) క్రీడల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి సీఎం కప్ క్రీడల నిర్వహణపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 27 నుండి జనవరి 2 వరకు హనుమకొండలో రాష్ట్రస్థాయి ముఖ్యమంత్రి ఛాంపియన్షిప్ ట్రోఫీ నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారుల కోసం వసతి, భోజనం, రవాణా తదితర సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. క్రీడల నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ ,రక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీస్ అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసే సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అశోక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అప్పయ్య పాల్గొన్నారు.

10 నుంచి కొత్తకొండ జాతర

కొత్తకొండ జాతర ఏర్పాట్లు పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ జాతర జనవరి 10 నుండి 18 వరకు జరుగనున్న నేపథ్యంలో శ్రీ వీరభద్ర స్వామి భద్రకాళి సమేత కళ్యాణోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు. ఆలయంలో మంగళవారం కలెక్టర్ దేవాదాయ, పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. వీఐపీ దర్శనం, కార్ పాసులను జారీ చేసేటప్పుడు ప్రొటోకాల్ పాటించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ ఆర్డీవో రాథోడ్ రమేష్, డిపిఓ లక్ష్మి రమాకాంత్, ఈవో కిషన్ రావు, ఏసీపీ తిరుమలరావు పాల్గొన్నారు.

చిక్కడపల్లి ఠాణాకు పుష్పరాజ్

- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై పోలీసుల విచారణ
- మూడున్నర గంటల పాటు అల్లు అర్జున్ స్టేట్ మెంట్ రికార్డ్
- అవసరమైతే మరోసారి నోటీసులు.. విచారణ



అక్షరదర్బార్, హైదరాబాద్: సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో సినీ నటుడు అల్లు అర్జున్ విచారణ ముగిసింది. మంగళవారం ఉదయం 11 గంటలకు తన తండ్రి అల్లు అరవింద్‌తో కలిసి అల్లు అర్జున్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా.. మధ్యాహ్నం 2.47 గంటల వరకు విచారించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన జరిగినపుడు స్పాట్‌లోనే ఉండడంతో ఈ విచారణలో ఏసీపీ రమేష్ కుమార్ కీలకంగా వ్యవహరించారు. విచారణ సందర్భంగా అల్లు అర్జున్‌ను 20 ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. సేకరించిన వీడియోలు, సీసీ ఫుటేజ్‌ను ముందు పెట్టి అల్లు అర్జున్‌ను విచారించినట్టు తెలుస్తోంది. మూడున్నర గంటల పాటు అల్లు అర్జున్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు పోలీసులు. అవసరమైతే మరోసారి నోటీసులు ఇస్తామని పోలీసులు తెలిపారు. మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని.. అందుబాటులో ఉండాలని అల్లు అర్జున్‌కు పోలీసులు తెలిపారు.

రౌడీ షీటర్లపై కఠినంగా వ్యవహరించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ను తనిఖీ

అక్షరదర్బార్, హన్మకొండ: ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే రౌడీ షీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీసులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, రౌడీ షీటర్లపై నిఘా ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలు, అలాగే కోర్టులో పెండింగ్‌లో వున్న కేసులు, వాటికి సంబంధించిన దర్యాప్తు వివరాలను ఇన్‌స్పెక్టర్ వివరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. శాంతి భద్రత నియంత్రణ కోసం నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, ప్రధానంగా రౌడీ షీటర్లపై నిఘా పెట్టాలని, ముఖ్యంగా సమస్యతో పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని వారిలో కలిగించాలన్నారు.

పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

తనిఖీల్లో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, ఏసీపీ నందిరాంనాయక్, ఇన్స్పెక్టర్ వెంటరత్నం, ఎస్సైలు సురేష్, రవీందర్, శ్రీకాంత్ తోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అండగా డీలర్లు ఉండాలి

- ఘనంగా బేయర్ డీలర్స్ మీట్..
- తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు

అక్షర దర్బార్, పరకాల : రైతులకు అండగా డీలర్లు ఉండాలని తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. నవత ఆగ్రో కెమికల్స్ ఆధ్వర్యంలో వరంగల్ శివనగర్ లోని ది వరంగల్ పెస్టిసైడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ బిల్డింగ్ లో బేయర్ డీలర్స్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కంపెనీ నుండి భారీ లాభాలు ఆశించకుండా రైతులకు న్యాయం చేసే విధంగా రైతుల పక్షపాతిగా డీలర్స్ ఉండాలని అన్నారు. వరిలో కలుపు మందు కౌన్సిల్ యాక్టివ్, మోగి పురుగు నివారణకు వయాగో ని వాడటం వలన వరి రైతులు అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చో వివరించారు. రైతులు ఎక్కువగా నమ్మేది డీలర్స్ నే అని, అటువంటి డీలర్స్ రైతులకు ఎప్పుడూ మేలు చేయాలని అన్నారు. చట్టానికి లోబడి న్యాయపరంగా మాత్రమే విత్తనాలు, పెస్టిసైడ్స్, పురుగు మందులను విక్రయించాలని అన్నారు. నకిలీ మందులు,విత్తనాలను విక్రయించవద్దని అన్నారు. కంపెనీ తరఫున మీకు అండగా మేమున్నామని భరోసానిచ్చారు. నకిలీ కంపెనీల నుండి అరికట్టడానికి లీగల్ సెల్ కూడా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నవత ఆగ్రో కెమికల్స్ భాగస్వాములు నరేంద్ర కుమార్, రంజిత్, బేయర్ కంపెనీ కమర్షియల్ మేనేజర్ అశోక్ రెడ్డి, క్యాంపెయిన్ మేనేజర్ నారాయణ రెడ్డి, వరంగల్ బిజినెస్ మేనేజర్ సతీష్, పరకాల బిజినెస్ మేనేజర్ శివేష్, వీరితో పాటు శ్రీనివాస్, అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ రెడ్డి, రాజేందర్ రెడ్డి, రమేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

అక్షర దర్బార్, పరకాల : ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని పరకాల ఎమ్మెల్యే రూవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఆర్ ఆర్ గార్డెన్లో నిర్వహించిన క్రిస్మస్ పండుగ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొని, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పరకాల ఏ సి పి సతీష్ బాబు, ఆర్డిఓ డాక్టర్ నారాయణ, మున్సిపల్ చైర్ పర్సన్ సోద అనిత రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ సుష్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

ఆయుధాలను తనిఖీ చేస్తున్న మల్టీజోన్2 ఐజీ సత్యనారాయణ

నేరాల నియంత్రణలో పోలీసుల పనితీరు భేష్

- మల్టీ జోన్ -2 ఐజీ వి.సత్యనారాయణ

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : నేరాల నియంత్రణలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసుల పనితీరు భేష్ అని మల్టీజోన్-2 ఐజీ వి. సత్యనారాయణ అన్నారు. మంగళవారం వార్షిక తనిఖీలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయం, ఆర్మడ్ రిజర్వు (ఏఆర్) ప్రధాన కార్యాలయం, డిసిఆర్బి, డిపిఓ బాంబ్ స్క్వాడ్ ,డాగ్ స్క్వాడ్ వివిధ విభాగాల పనితీరును ఐజి తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐజి మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా అనేది మావోయిస్టు ప్రభావిత ప్రాంతమని, ప్రస్తుతం మావోయిస్టులు తగ్గుముఖం పట్టినప్పటికీ పలిమెల మండలం అనేది కీలకమని అన్నారు. జిల్లా సరిహద్దులుగా మహారాష్ట్ర , ఛతీస్ ఘడ్ రాష్ట్రాలు ఉన్నాయని, జిల్లా పోలీసులు అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఎస్పీ కిరణ్ ఖరే ఆధ్వర్యంలో లా అండ్ ఆర్డర్ అమలు బాగుందని ఐజి పేర్కొన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు సవాల్ గా మారాయని అన్నారు. అలాగే ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూనే నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఐజి సత్యనారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అదనపు ఎస్పీలు బోనాల కిషన్, వేముల శ్రీనివాస్, డిఎస్పీలు సంపత్ రావు, రామ్మోహన్ రెడ్డి, నారాయణ నాయక్, డిపిఓ ఏవో ఫర్హానా, జిల్లా పరిధిలోని ఇన్స్పెక్టర్లు ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వంలో అన్ని మతాలకు గౌరవం

- డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్

అక్షర దర్బార్, నర్సింహులపేట : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తుందని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ అన్నారు. మంగళవారం నర్సింహుల పేట మండల కేంద్రంలోని క్రిస్టియన్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారతదేశంలో అన్ని మతాలు కులాలు సమానమని ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి మార్గదర్శం అని అన్నారు.

బాధిత కుటుంబాలను పుట్ట మధుకర్ పరామర్శ..

అక్షర దర్బార్, మహాదేవపూర్ : మండల కేంద్రంతో పాటు పల్గుల గ్రామంలో మంగళవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీతాబాయి, పలిమెల మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి, మహదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, యూత్ నాయకుడు అలిమ్ ఖాన్ పాల్గొన్నారు

మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధే చేస్తా..

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- అయ్యప్ప స్వామి ఆలయంలో మహా పడిపూజ
- పూజల్లో పాల్గొన్న మంత్రి

అక్షర దర్బార్, మహాదేవపూర్ : అయ్యప్ప స్వామి ఆశీస్సులతో మంథని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామనని ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నాగేంద్ర గిరి అయ్యప్ప స్వామి ఆలయంలో జరిగిన అయ్యప్ప పడిపూజలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మంత్రికి ఆలయ చైర్మన్ పనకంటి రమేష్ దంపతులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని అన్నారు.

కాళేశ్వరం ఆర్చీ నిర్మాణానికి భూమి పూజ

మహదేవపూర్ నుండి కాళేశ్వరం వెళ్లే రహదారిపై రూ.32 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆర్చి గేట్ నిర్మాణానికి ఐటీ మంత్రి శ్రీధర్ బాబు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్బర్ ఖాన్, యూత్ నాయకుడు విలాస్ రావు, మాజీ ఎంపీపీ రాణి బాయి, మాజీ జెడ్పిటిసి గుడాల అరుణ శ్రీనివాస్, సీనియర్ నాయకులు వామన్ రావు, వరప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, అస్రార్, కాళేశ్వరం దేవస్థానం ఈవో మారుతి, సూపరింటెంట్ బుర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి పడి పూజలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

స్వచ్ఛదనం- పచ్చదనంలో ఎమ్మెల్యే నాటిన మొక్క

సంరక్షించే వారు లేక ఎండిపోయిన మొక్క

ఎమ్మెల్యే నాటిన మొక్క ఎండిపోయే..

- స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో నాటిన మొక్కలు మాయం
- క్షేత్రస్థాయి అధికారుల్లో కొరవడిన చిత్తశుద్ధి

అక్షర దర్బార్, పరకాల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమానికి నిర్లక్ష్యం చీడ పట్టింది. క్షేత్రస్థాయి అధికారుల్లో చిత్తశుద్ధి లోపించడం వల్ల ఈ కార్యక్రమం పరిహాసంగా మారుతోంది. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ద్వారా చివరకు ఎమ్మెల్యేలు నాటిన మొక్కలు సైతం ఎండిపోవటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. పల్లెలు, పట్టణాలు పచ్చదనం, పరిశుభ్రతతో ఉండాలని కాంగ్రెస్ ప్రభుత్వం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది. గత ఆగస్టులో ఆయా శాసనసభ నియోజకవర్గం పరిధిలో స్థానిక ఎమ్మెల్యేతో మొక్కలు నాటడం ద్వారా ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. అయితే ఈ కార్యక్రమం ద్వారా నాటిన మొక్కల్లో కొన్ని ఎండిపోగా మరికొన్ని మాయమైన సంఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలంలో చోటు చేసుకుంది. నడికూడ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి స్థానిక అధికారులతో కలిసి స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటారు. చెట్లు ప్రగతికి మెట్లు అని, అధికారులు చెట్లను కాపాడాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయినా స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటం, పట్టించుకోకపోవడంతో ఇక్కడ ఎమ్మెల్యే నాటిన మొక్కలు ఎండిపోయాయి. ఎమ్మెల్యే నాటిన మొక్కలనే పట్టించుకోకుంటే ఇతరులు నాటిన మొక్కలు ఎలా దక్కుతాయి, పెరుగుతాయని స్థానికులు విమర్శిస్తున్నారు.

10శాతం మాత్రమే ప్రాణంతో..

నడికూడ మండలంలోని పలు గ్రామాలలో పచ్చదనం స్వచ్ఛదనం కార్యక్రమంలో నాటిన మొక్కల్లో కేవలం 10 శాతం మాత్రమే దక్కాయని, మిగతావన్నీ ఆయా గ్రామ కార్యదర్శి పట్టించుకోకపోవడంతో ఎండిపోయాయని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక అధికారులు చోద్యం చూడడం తప్ప స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం నాటిన మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టకపోతుండటాన్ని ప్రజలు తీవ్రంగా నిరసిస్తున్నారు.

చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పేదలకు అండగా 'సీఎంఆర్ఎఫ్'

- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

అక్షర దర్బార్, తొర్రూరు : పేదలకు సీఎంఆర్ఎఫ్ కొండంత ఆసరాగా నిలుస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తొర్రూరు, పెద్దవంగర మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 46 మంది బాధితులకు మంజూరైన రూ.15,13,000 సీఎం సహాయనిధి చెక్కులను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అంకిత భావంతో పనిచేస్తుందని, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు వైద్య చికిత్సల కోసం లేదా అత్యవసర సమయంలో ఆర్థిక సహాయం సీఎం సహాయనిధి ద్వారా అందిస్తున్న సాయాన్ని వారు విశేషంగా కొనియాడారు.

డ్రంక్ అండ్ డ్రైవ్

పలువురిపై కేసులు నమోదు, జరిమానా

అక్షర దర్బార్, శాయంపేట : ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో పట్టుబడిన శాయంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురు వ్యక్తులు పుట్ట సాయిచరణ్, సయ్యద్ జహంగీర్, శివప్రసాద్, దానబోయిన రాజు, గజ్జి ఐలయ్య, ఇమ్మడిశెట్టి రాజేందర్ ,మహమ్మద్ సుల్తాన్ పై కేసు నమోదు చేసినట్లు శాయంపేట ఎస్సై తెలిపారు. నిందితులను మంగళవారం పరకాల సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా, వారికి రూ.7050 జరిమానా విధించారు.

ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

శాయంపేట ఎస్సైకి సన్మానం

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ ను మంగళవారం మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాష్, మాజీ సర్పంచ్ కందగట్ల రవి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో పరకాల ఏఎం సి వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సాదు నాగరాజు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు చింతల రవిపాల్ పాల్గొన్నారు. బిఆర్ఎస్ ఆధ్వర్యంలో: శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ ను పరకాల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మారపల్లి నందం, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గాజె రాజేందర్, సోషల్ మీడియా కన్వీనర్ దైనంపల్లి సుమన్, శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పరకాల మున్సిపల్‌లో క్రిస్మస్ వేడుకలు

అక్షర దర్బార్, పరకాల : పరకాల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను కమిషనర్ కె.సుష్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈ రంజిత్ , జేఏఓ అర్షద్, శ్రీనివాసరావు, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

- మూడు ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేసిన పోలీసులు
- అయిదుగురు వ్యక్తులపై కేసు నమోదు

జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసిన ఎస్సై పరమేష్

అక్షర దర్బార్ శాయంపేట : ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా చెరువుల నుంచి మట్టి తరలిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు శాయంపేట ఎస్సై పరమేష్ తెలిపారు. ఈ కేసులో మూడు ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేసి, ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అంబేద్కర్ ను అవమానిస్తే ఊరుకోం..

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో హన్మకొండలో నిరసన
- కేంద్ర ప్రభుత్వంపై ఎమ్మెల్యేల ఆగ్రహం

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అక్షరదర్బార్, హన్మకొండ: ప్రపంచ దేశాలు భారత రాజ్యాంగాన్ని ప్రశంసిస్తుంటే కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాతను అవమానించడం దుశ్చర్య అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి , కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటి నుంచి బీజేపీ ప్రభుత్వం మత తాత్వాన్ని ప్రేరేపిస్తూ, కాంగ్రెస్ పార్టీపై విషం చిమ్ముతోందన్నారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌పై అమిత్ షా మాట్లాడిన తీరుపై ఇప్పటి వరకు బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడం చాలా దురదృష్టకరమని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి కేంద్ర మంత్రి మండలి నుంచి తొలగించాలని లేదంటే పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు మెమోరాండం అందించారు.

నివాళులర్పిస్తున్న పుట్ట మధుకర్

అన్నమనేని లక్ష్మణ్ రావుకు పుట్ట మధు నివాళి..

అక్షర దర్బార్ మల్హర్ : తాడిచెర్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అన్నమనేని లక్ష్మణ్ రావు (60) సోమవారం మృతిచెందగా మంగళవారం ఆయన అంత్యక్రియలకు మంథని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పుట్ట మధుకర్ హాజరై లక్ష్మణ్ రావు పార్థివ దేహానికి,పార్టీ కండువా, పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గొనె శ్రీనివాసరావు, రాఘవ రెడ్డి తోపాటు పలువురు పాల్గొన్నారు

అక్షర దర్బార్

ఒకే పత్రిక ... సుదీర్ఘ ప్రయాణం.

- ఆంధ్రప్రభలో ముప్పై ఏడేళ్ల పాత్రికేయ ప్రస్థానం
- అలుపెరుగని జర్నలిస్ట్
- అవిశ్రాంత కలం యోధుడు.. మెండు రవీందర్

జర్నలిస్ట్.. ఒక పత్రికలో లేదా ఛానెల్లో ఏడాది, రెండేళ్ళు, ఎక్కువలో ఎక్కువగా పదేళ్ళు పనిచేయడం సహజం. సుదీర్ఘకాలం ఒకే పత్రికలో అవిశ్రాంతంగా పనిచేయడం చాలా అరుదు. ఆ అరుదైన వ్యక్తుల్లో ఒకరు మెండు రవీందర్. ఒకే పత్రికలో ఏకథాటిగా పనిచేస్తున్న ఏకైక జర్నలిస్ట్ ఎవరైనా ఉన్నారంటే గుర్తుకువచ్చేది ఆయనే.

తెలుగు రాష్ట్రాల్లో ముప్పై ఏడేళ్ళుగా ఒకే పత్రికలో పూర్తి కాలం జర్నలిస్టుగా పనిచేస్తున్న ఏకైక కలం యోధుడు మెండు రవీందర్. ప్రస్తుతం హనుమకొండ జిల్లా ఆంధ్రప్రభ దిన పత్రిక లో స్టాఫ్ రిపోర్టర్ గా పనిచేస్తున్న రవీందర్ 1987 డిసెంబర్ 25న వరంగల్ జిల్లాలోని పరకాల విలేఖరిగా నియమితులైనారు. అప్పటి నుండి నేటి వరకు అదే పత్రికలో కొనసాగుతున్నారు. గడిచిన మూడున్నర దశాబ్దాలుగా జర్నలిజమే ఇతివృత్తంగా వివిధ జిల్లాలో, వివిధ హోదాలో పనిచేశారు. అనేక కథనాలు ఆయన కలం నుండి జాలువారాయి.

–అక్షరదర్బార్, హనుమకొండ



జర్నలిస్టుగా ప్రస్థానం..

ఎన్నో పరిశోధనాత్మక కథనాలు మరెన్నో మానవీయకోణాలు అవిష్కరించే వార్తా కథనాలు రాసారు. ఎంతో మంది ప్రముఖులను ఇంటర్వ్యూ చేసారు. మరెంతో మంది జాతీయ నాయకులు పాల్గొన్న సభలను కవర్ చేశారు. వరంగల్ ఉమ్మ డి జిల్లాలో జర్నలిజం రంగానికే ఆణిముత్యంగా నిలిచారు. తొలుత పరకాల ఆంధ్రప్రభ విలేకరిగా రవీందర్ 1987 డిసెంబర్ 25న పాత్రికేయ వృత్తి ప్రారంభించారు. ఆ తరువాత పరకాల ములుగు రెవెన్యూ డివిజన్ విలేఖరిగా హన్మకొండ, వరంగల్ స్టాఫ్ రిపోర్టర్ 2008 వరకు వరంగల్ జిల్లాలో పనిచేసారు. ఆ తరువాత నిజామాబాద్ స్టాఫ్ రిపోర్టర్ గా, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు బ్యూరో ఇంచార్జ్ గా ఏడాది కాలం పాటు పనిచేసారు. కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గా మరో ఏడాది పనిచేశారు. తిరిగి 2011లో స్వంత జిల్లాకు చేరుకొని రూరల్ జిల్లా ప్రతినిధిగా పనిచేశారు. 2012లో వరంగల్ బ్యూరో ఇంచార్జ్ బాధ్యతలు స్వీకరించారు. 2018 వరకు అదే పదవిలో కొనసాగారు. కొంత కాలం పాటు ఉత్తర తెలంగాణ ఆంధ్రప్రభ ప్రతినిధిగా పనిచేసిన రవీందర్ ప్రస్తుతం హనుమకొండ జిల్లా ప్రతినిధిగా కొనసాగుతున్నారు. జర్నలిజంలో ప్రవేశించిన ముప్పై ఏడేళ్ళలో మరే పత్రికలో చేరకుండా ఆంధ్రప్రభలోనే పనిచేస్తున్నారు. పూర్తికాలం జర్నలిస్టుగా కొనసాగుతున్న రవీందర్ తన పాత్రికేయ జీవితంలో ఎన్నో సంచలనాత్మక, పరిశోధనాత్మక కథనాలు వెలుగులోకి తెచ్చారు.

మానవీయ కథనాలు ...

రవీందర్ తన మూడున్నర దశాబ్దాల పాత్రికేయ జీవితంలో మానవీయ కథనాల ఆవిష్కరణ కోసం ప్రాధాన్యత నిచ్చారు. వరంగల్ జిల్లాలో ప్రత్తిరైతుల ఆత్మహత్యలు, తునికాకు సేకరణలో గిరిజనుల జీవన విధానం, సింగరేణి భూనిర్వాసితుల వెతలు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు భూనిర్వాసితుల బాధలు, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లోని చెఱుకు రైతుల కష్టాలు, సిరిసిల్ల చేనేత కార్మికుల ఆకలి చావులు, అంతర్గాం మిల్లు కార్మికుల స్థితిగతులు, వరంగల్ జిల్లాలోని ఏపీ రేయాన్స్ ఫ్యాక్టరీ కార్మికుల ఇబ్బందులపై మానవీయ కోణంలో వ్యాసాలు వ్రాసారు.

పరిశోధనాత్మక కథనాలు ..

రోడ్లు, ప్రాజెక్టులు నిర్మాణాల్లో జరిగిన అక్రమాలను వెలుగులోకి తేవడంలో పలువురు ఇంజనీర్లు సస్పెండ్ కు గురైనారు. పరకాల విలేఖరిగా పనిచేస్తున్న సందర్భంలో 1989లో వెలుగులోకి తెచ్చిన రోడ్డు కుంభకోణంలో 8 మంది ఇంజనీర్లపై వేటు పడింది. పరకాల నుండి కొప్పుల అనే గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు కాగా పనులు చేయకుండానే నిధులు కాజేసిన కథనం అప్పట్లో సంచలనం రేకెత్తించింది. దీనిపై విజిలెన్స్ విచారణ అనంతరం ఏఈ నుండి ఈఈ వరకు 8 మంది ఇంజనీర్లు సస్పెండ్ కు గురైనారు. ఇలా ఎన్నో పరిశోధనాత్మక కథనాలు రాసి అధికారుల్లో చలనాన్ని తీసుకొచ్చారు.

కదలిక తెచ్చిన కథనాలు :

రవీందర్ పాత్రికేయునిగా వ్రాసిన పలు కథనాలు ప్రభుత్వాల్లో కదలిక తెప్పించాయి. పరిష్కారానికి మార్గం చూపాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండవ దశలో భాగంగా వరంగల్ జిల్లాలోని చిట్యాల, భూపాలపల్లి మండలాలకు ఎస్సారెస్పీ డిబియం 38 నెం. తో కాల్వ మంజూరైంది. చిట్యాల మండలంలోని చివరి గ్రామాల భూములకు సాగునీరు అందించేందుకు కాల్వలు వచ్చాయి. 20 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే ఈ కాలువ నిర్మా ణ పనులు చిన్న కారణంతో మూడేళ్ళపాటు నిలిచిపోయాయి. కాలువ కింద తన మునగచెట్లు పోతున్నందున వాటికి నష్టపరిహారం చెల్లించాలని ఓ రైతు న్యాయస్థానం మెట్లెక్కాడు. దీంతో అక్కడ పని నిలిపివేశారు. రెండు వైపులా కాలువల నిర్మా ణం, సిమెంట్ లైనింగ్ పూర్తిచేశారు. ఈ విషయాన్ని కాలువకు అట్టొచ్చిన మునగతోట పేరిట వ్రాసిన కథనానికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. అప్పటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి కడియం శ్రీహరి ఆ రైతును పిలిపించి నష్టపరిహారం విషయంలో న్యాయం చేయడంతో మూడేళ్ళుగా నిలిచిపోయిన కాలువ పనులు తిరిగి ప్రారంభమయినాయి.

జర్నలిస్టు సంఘం నేతగా..

ప్రెస్ క్లబ్, జర్నలిస్ట్ సంఘాల కార్యకలాపాల్లో తొలినుండి రవీందర్ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. నాలుగు పర్యాయాలు పరకాల ప్రెస్ క్లబ్ కు అధ్యక్షునిగా పనిచేశారు. సింగరేణి కోల్ బెల్ట్ జర్నలిస్టు సంఘానికి ఉపాధ్యక్షునిగా వ్యవహరించారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం, వరంగల్ జిల్లా యూనిట్ కు రెండుసార్లు ఉపాధ్యక్షునిగా, రెండు పర్యాయాలు జిల్లా శాఖ కన్వీనర్ గా పనిచేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా నాలుగు పర్యాయాలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా రెండు పర్యాయాలు, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా ఒక పర్యాయం పనిచేశారు. ఆ తరువాత అల్లం నారాయణ నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజె) రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. ప్రస్తుతం ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐ.జె.యు.) జాతీయ కౌన్సిల్ సభ్యునిగా కొనసాగుతున్నారు.

ప్రముఖుల ఇంటర్వ్యూలు..

మూడున్నర దశాబ్దాల పాత్రికేయ జీవితంలో మెండు ఎంతోమంది ప్రముఖులను ఇంటర్వ్యూ చేశారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో పాటు మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ నుండి మొదలు కొని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు సీఎంలందరినీ ఇంటర్వ్యూ చేశారు. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టిడిఎల్పి నాయకునిగా ఉన్నప్పుడు చేపట్టిన పాదయాత్ర సందర్భంగా భూపాలపల్లి జిల్లాలోని జంగేడు గ్రామం వద్ద ఇంటర్వ్యూ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఉద్యమనేతగా సమ్మ క్క– సారలమ్మ తల్లులను దర్శించుకునేందుకు ఫిబ్రవరి 2000 సం॥లో మేడారం రాగా ట్రాఫిక్ కారణంగా పస్రాలో నిలిచిపోయారు. అప్పుడు రవీందర్ కేసీఆర్ ను తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ స్వరూపంపై ఇంటర్వ్యూ చేశారు. ఆ తరువాత 2009 నవంబర్ లో కరీంనగర్ జిల్లాలో పనిచేస్తున్నప్పుడు కేసీఆర్ ను మరోమారు ఇంటర్వ్యూ చేశారు. సిద్ధిపేటలో అమరణ నిరాహారదీక్షకు వెళ్ళే ముందు కేసీఆర్ తీగలగుట్టపల్లిలోని తన నివాసంలో బస చేసినప్పుడు ఇంటర్వ్యూ చేశారు. ఉమ్మ డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, వైఎస్, రాజశేఖరరెడ్డి, నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి లను కూడా ఇంటర్వ్యూ చేశారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు బిజెపి రాష్ట్ర అధ్యక్షుని హోదాలో పరకాలు వచ్చిన సందర్భంగా ప్రత్యేక ఇంటర్వ్యూ చేశారు. ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ కేంద్రమంత్రి చిరంజీవిని నిజామాద్ జిల్లా బాల్కొండలో ఇంటర్వ్యూ చేశారు. 1990 దశకంలో అప్పటి చంద్ర పుల్లారెడ్డి వర్గం నక్సలైట్ నాయకుడు సామ అంతిరెడ్డి. అప్పటి పీపుల్స్ వార్ అగ్రనేత నల్లా ఆదిరెడ్డి, సిపిఐ (ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యులైన కేరళకు చెందిన కె. రామచంద్రన్, పంజాబ్ కు చెందిన దర్శన్ సింగ్ కట్కర్, మాజీ సెక్సలైట్ నాయకుడు కె.జి. సత్యమూర్తి లాంటి నాయకులను ములుగు అటవీ ప్రాంతాల్లో కలిసి ఇంటర్వ్యూ చేశారు. ఎంతో మంది జాతీయ నాయకులు పాల్గొన్న సభలను కవర్ చేశారు. వరంగల్ జిల్లాకు చెందిన ప్రముఖులైన కాళోజీ నారాయణరావు, దాశరథి, ప్రొఫెసర్ జయశంకర్ ల గురించి ఎడిటోరియల్ పేజీల్లో పలు వ్యాసాలు వ్రాశారు.